విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

గురువారం 18 సెప్టెంబరు 2025 8 పేజీలు

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేయండి

రాష్ట్ర ముఖ్యమంత్రికి టిటిడి ఛైర్మన్, ఈవో ఆహ్వానం

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ :

ఈ నెల 24వ తేదీ నుండి ప్రారంభం కానున్న తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యురాలు జానకి దేవి, అదనపు ఈవో సిహెచ్ వెంక య్య చౌదరి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను ఆహ్వానించారు. బుధవారం ఉదయం వెలగ పూడిలోని క్యాంప్ కార్యాలయంలో వారు ముఖ్యమంత్రిని కలసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్, ఈవో, అదనపు ఈవో ముఖ్యమంత్రికి తీర్థ ప్రసాదాలను అందించారు. తరువాత వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను ఛైర్మన్, ఈవో ముఖ్యమంత్రికి వివరించారు.

విశ్వకర్మ మహర్షి...

అందరికీ మార్గదర్శకం

- జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి
- చిత్తూరులో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - చిత్తూరు: విశ్వకర్మ మహర్షి అందరికీ మార్గదర్శకమని జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. బుధవారం చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రపంచపు తొలి వాస్తు శిల్పిగా సృష్టికర్తగా విశ్వకర్మ మహర్షి పేరుగాంచారని చెప్పారు. శిల్పకళ వృత్తిపరమైన నైపుణ్యాలకు విశ్వకర్మ ఆరాధన ఎంతో ప్రేరణ ఇస్తుందన్నారు. సమాజంలో వృత్తి నిపుణులు శిల్పులు కార్మికులకు గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించిన ఘనత విశ్వకర్మ మహర్షికే దక్కిందన్నారు. నేటి తరానికి ఆయన స్ఫూర్తి దాయకంగా నిలిచారన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

2లో

గడువులోపు రీసర్వే పనులు

పూర్తిచేయండి

- కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర - తిరుపతి : నగర పరిధిలో నిర్వహిస్తున్న రీ సర్వే (నక్ష) పనులు గడువు లోపు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ప్రభుత్వ భూముల రిసర్వే పనులను కమిషనర్ స్వయంగా పరిశీలించారు.

2లో

చిత్తూరును అందంగా తీర్చిదిద్దుదాం

8లో

విచ్చలవిడిగా..

బెల్టుషాపులు

- అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు
- మద్యం దుకాణాలు తొలగించాలంటూ మహిళల ఆందోళన

- నగరిలో ఏరులై పారుతున్న మద్యం

2లో

విశాలాంధ్ర - పుత్తూరు :

ఆంధ్రప్రదేశ్ కాస్త మద్యాంధ్రప్రదేశ్ గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రైవేట్ మద్యం పాలసీని తీసుకొచ్చింది. తెలుగు తమ్ముళ్లు అక్రమ మార్గాలు, సామ దాన దండోపాయాలతో షాపులను దక్కించుకున్నారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బెల్ట్ షాపులను విచ్చలవిడిగా ఏర్పాటు చేశారు. బెల్ట్ షాపులు గ్రామాల్లోనూ వెలుస్తుండడంతో గ్రామీణ మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతున్నారు. నగరి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నగరి, నిండ్ర, విజయపురం మండలాలు ఉన్నాయి. ఈ మూడు మండలాల్లో అధికారికంగా 12 మద్యం షాపులు, ఒక బార్ ఉండగా, అనధికారికంగా 200కు పైగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసినట్లు సమాచారం. కూటమి నాయకులు ఈ బెల్ట్ షాపుల కోసం వస్తున్నవారి నుంచి రూ.లక్ష డిపాజిట్ వసూలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో బెల్ట్ షాపుల్లో కేవలం చీప్ లిక్కర్ మాత్రమే అమ్మేవారు. నేటి బెల్ట్ షాపుల్లో బీర్లతో సహా అన్ని రకాల బ్రాండ్లను అందుబాటులో ఉంటున్నాయి. పేరుకు బెల్ట్ షాపు గానీ వాస్తవానికి మినీ మద్యం షాపుగా సడుపుతున్నారు. మద్యం షాపులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించాల్సి ఉండగా

పూర్తిచేయండి

(మొదటి పేజీ తరువాయి) ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన నక్ష (రిసర్వే) కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా ఉన్న నాయకులను, ప్రజలను కలుపుకుని పారదర్శకంగా సర్వే చేయాలని తెలిపారు. ముందుగా ప్రభుత్వ భూములను సర్వే చేసి అన్యాక్రాం తం కాకుండా చూడాలని ఆదేశించారు. వాటి సరిహద్దులు పక్కాగా చేపట్టి, తరువాత ప్రైవేట్ భూములను సర్వే నిర్వహించాలని తెలిపారు. ఈ రిసర్వేలో అవకతవకలు లేకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, డీసీపీ ఖాన్, ఏసిపి లు మూర్తి, మధు, సర్వేయర్ కోటేశ్వర రావు, గురువా రెడ్డి, తగితరులు ఉన్నారు.

అందరికీ మార్గదర్శకం

(మొదటి పేజీ తరువాయి) మాట్లాడుతూ విశ్వకర్మ విశ్వాసాన్ని సృష్టించిన శిల్పిగా ప్రసిద్ధికి ఎక్కారని ఈ సందర్భం గా శిల్ప కళాకారులను గౌరవించుకోవాలన్నారు. శిల్ప కళాకారుల కృషి నీ నేటి తరం స్మరించుకోవాలని చెప్పారు. విశ్వబ్రాహ్మణులు తమ కళా నైపుణ్యముతో దశాబ్దాలుగా అనేక కళాఖండాలు సృష్టిస్తూ తమ వృత్తిని కొనసాగిస్తున్నారని వీరి శ్రేయస్సు కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఆముద రాష్ట్ర బీసీ కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, విశ్వబ్రా హ్మణ చైర్మన్ పార్వతమ్మ, పలువురు అధికార అనధికార ప్రముఖులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా బెల్టుషాపులు

(మొదటి పేజీ తరువాయి) అర్ధరాత్రి వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. గత వైఎస్సార్సీపీ పాలనలో ఐదేళ్ల పాటు మద్యం దుకాణాలన్నింటినీ ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చే సమయానికి ఉన్న 4,380 మద్యం షాపులను 2,934కు పరిమితం చేశారు. అదికూడా ప్రభుత్వ షాపులుగా ఏర్పాటు చేసి, ప్రభుత్వానికి మాత్రమే ఆదాయం అందేలా చేశారు. కేవలం నిర్ణీత సమయాల్లో మాత్రమే అమ్మకాలు జరిగేది. బెల్ట్ షాపు అనే మాటే వినబడ కుండా చేశారు. నేటి కూటమి ప్రభుత్వం 3,306 షాపులతో మళ్లీ ప్రైవేటు పాలసీని తీసుకొచ్చింది. ఈ మొత్తం షాపుల కింద మరో 30 వేల బెల్ట్ షాపులతో రాష్ట్ర వ్యాప్తంగా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. ఇకనైనా ఎక్సైజ్ శాఖ అధికారులు నిబంధనలను పాటించని మద్యం షాపులను తొలగించాలని మహిళలు కోరుతున్నారు. అలాగే మద్యం షాపులను సైతం నిర్ణీత సమయంలో మాత్రమే తెరచి ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.

సుబ్రమణ్యం నాయుడు మృతి బాధాకరం

- టిడిపి యువ నాయకుడు పులి వర్తి వినీల్

విశాలాంధ్ర - చంద్రగిరి: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు డిసిఎంఎస్ చైర్మన్ మండల మాజీ అధ్యక్షులు పల్లి నేని సుబ్రహ్మణ్యం నాయుడు మృతి బాధాకరమని ఎంఎల్ఏ పులివర్తినాని తనయుడు పులివర్తి వినీల్ బాబు అన్నారు. చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ గడ్డంవారిపల్లిలో పల్లినేని సుబ్రమణ్యం నాయుడు పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన యువ నాయకుడు పులివర్తి వినీల్ బాబు సంతాపం వ్యక్తం చేశారు. చంద్రగిరి మండలంలో గొప్ప నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతి తెలుగుదేశం పార్టీకి, చంద్రగిరి మండలానికి తీరని లోటన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని తెలిపారు. వినీల్ తో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం

విశాలాంధ్ర - పలమనేరు : పట్టణంలో స్థానిక వెలుగు కార్యాలయము నందు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాన్ని నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్లు నజ్మా, మాధవి లత బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ ,సిడిపిఓ ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన ముఖ్య అతిథులు మాట్లాడుతూ ...అంగన్వాడి పరిధిలోని గర్భవతులు, బాలింతలు, పిల్లలు సంరక్షణ, పౌష్టికాహారం, పరిశుభ్రత గురించి క్లుప్తంగా వివరించడం జరిగిందన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవాలు గురించి అంగన్వాడి కేంద్రంలో నిధులు నిర్వహిస్తున్న వర్కర్స్ కు ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. అదేవిధంగా ఎంపీడీవో వినోద, ఆయుష్ డిపార్ట్మెంట్ మెడికల్ అధికారి ఉమారాణి మాట్లాడుతూ స్వస్తినారి, స్వస్త్ పరివార్ అభియాన పథకం గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పోషణ్, మా ప్రోగ్రాం ను ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ 16వ తేదీ వరకు ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా ఈ ప్రోగ్రామ్ను గ్రామస్థాయిలో ఉన్న ప్రతి తల్లికి తెలిసే విధంగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు లతా, కల్పన, పుష్ప, గీతమ్మ, అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

గజరాజులు రాకుండా సోలార్ కంచె

విశాలాంధ్ర - రామకుప్పం : మండల పరిధిలోని అటవీ సమీప ప్రాంతాలైన ఎస్ గొల్లపల్లి తదితర గ్రామాల వైపు రాత్రి సమయాల లో ఏనుగులు రాకుండా ఉండేందుకు సుమారు 36 లక్షల రూపాయల వ్యయంతో సోలార్ కంచె ఏర్పాటు చేయనున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి మరియు మాజీ మండల అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏనుగుల దాడినుండి రైతులు పండించిన పంటలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో సోలార్ కంచె అమర్చేందుకు అవసరమైన సుమారు 36 లక్షల రూపాయలను విడదల చేయడంతో బుధవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కావలి మడుగు నుండి ఎస్ గొల్లపల్లి , పిఎంకె తాండ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర కంచె ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత ఆరు నెలల నుండి ఏనుగులు రైతన్నలు పండిస్తున్న పంటలపై పడి అపార నష్టం కలిగించాయన దీంతో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన అటవీ సమీప ప్రాంతాలైన గ్రామాల వద్ద సోలార్ కంచె అమర్చేం దుకు అవసరమైన చర్యలు తీసుకో వాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి వెంటనే పనులను ప్రారంభించడం తో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి హరికుమార్, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, మహ్మద్ రఫీ, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - చిత్తూరు: జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో బుధవారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నేత షణ్ముగం ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే బిజెపి కార్యకర్తలు అన్నదాన రక్తదాన కార్యక్రమంలో నిర్వహించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి స్థానికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, బిజెపి నేతలు చిట్టిబాబు అట్లూరిశ్రీనివాసులు,పలువురుకూటమినేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలింతలు, గర్భిణీలకు అవగాహన

విశాలాంధ్ర - రామకుప్పం : మండల పరిధిలోని విజలాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ని ఆనిగానూరు గ్రామంలో బాలింతలు మరియు గర్భిణీలు తమ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల పై వైద్యాధికారిణి పూజిత అవగాహన కార్యక్రమం ఏర్పాటు ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ గర్భిణీలు మరియు బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అదేవిధంగా క్రమం తప్పకుండా నడవడం తదితర తేలిక పాటి వ్యాయామాలు చేయాలని అవసరమైతే ఆరోగ్య కేంద్రం లో సంప్రదించాలని సూచించారు. అనంతరం క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తూ క్యాన్సర్ వ్యాధి లక్షణాల పట్ల అనుమానం కలిగితే అశ్రద్ధ చేయకుండా వెంటనే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు కార్యక్రమంలో వివిధ రకాల వ్యాధులతో బాధ పడుతున్న సుమారు 70 మంది పాల్గొన్నారని అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో విద్యాధికారి బాలు, మరియు ఆసుపత్రి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీలు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు ప్రమాదం

మహిళలకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - వెంకటగిరి: ఆర్టీసీ హైయర్ బండి ఏపీ 39 యుఐ 41 30 నెంబర్ గల ఆర్టీసీ బస్సు నెల్లూరు నుండి సోమవారం సాయంత్రం వస్తుండగా గూడూరు రూరల్ మండలంలోని బాలాయపల్లి సమీపంలో గల కుమ్మనేటూరు గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి చెట్టుకు ఢీ కొనడంతో వెంకటగిరి మాసాపేటకు చెందిన దక్కిలి దుర్గాదేవి (40) తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.ప్రమాదంలో గాయపడిన ఇంకొందరిని గూడూరు ప్రభుత్వ తరలించినట్లు సమాచారం.

చింతమాకులపల్లిలో తెదేపా మోసం గ్యారంటీ

విశాలాంధ్ర - వి.కోట: మండలంలోని చింతమాకులపల్లి పంచాయతీ లో బుధవారం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్ కార్యక్ర మాన్ని ఎంపీపీ, వైస్సార్సీపీ మండల అధ్యక్షులు యువరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయ తీలోని ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉద్దేశించి మాట్లాడుతూ.. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా అందుబాటులో ఉంచి ప్రతి రైతుకి అవసరాన్ని బట్టి యూరియా అందించాలని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభు త్వంలో యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలో నిలబ డాల్సిన అవస్థలు ఏర్పడ్డాయన్నారు. పక్కపల్లెల నుండి వచ్చే రైతులకు రవాణా ఖర్చులతో పాటు సమయం కూడా వృధా ఔతోందని రైతన్నలు ఒకింత ఆవేదనతో పాటు మండిపడుతు న్నారని తెలిపారు. కార్యక్రమంలో ముదరందొడ్డి మాజీ సింగల్ విండో చేర్మన్ గోపి రెడ్డి ,సర్పంచ్ రాంచంద్రప్ప ,సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, నరసింహ రెడ్డి, బాటమ్మగారి వెంకటేష్ నారాయణప్ప ,కన్వీనర్ నాగరాజు , రమేష్, నాగరాజు, సవేంద్ర, మంజునాథ్ ఆనంద్, వైస్సార్సీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషన్ మా కార్యక్రమం

విశాలాంధ్ర- వెదురుకుప్పం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషన్ మా కార్యక్రమం పై కార్వేటినగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శోభా రాణి,పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కిష్ణచైతన్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.బుధవారం మండలంలోని మాంబేడులో అంగన్వాడీ సిబ్బంది,ఆరోగ్య సిబ్బందికి సూచించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు,చిన్నపిల్లలు పోషణ,ఆరోగ్య స్థితిగతులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. వారి సంరక్షణ కోసం పురుషుల భాగస్వామ్యం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైసర్ శకుంతల, ఆశా వర్కర్లు,అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డి.ఎస్సి నియామకాల్లో హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

విశాలాంధ్ర - పలమనేరు: ఇటీవల విడుదల చేసిన డి ఎస్ సి 2025 ఫలితాల ఎంపికలో ఆప్షన్ కు కాకుండా మెరిట్ కు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు యూ టి ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎన్. సోమ చంద్రారెడ్డి పేర్కొన్నారు. గతంలో అన్ని డి ఎస్ సి లలో ఫలితాలను ప్రకటించడం, ధ్రువ పత్రాల పరిశీలనప్పుడు ఏ పోస్టును ఎంపిక చేసుకొంటారోనని అడిగేవారన్నారు.అందుకు భిన్నంగా ఈ డి.ఎస్.సి దరఖాస్తు చేసేటప్పుడే ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకోవాలని,ఆ మేరకే పోస్ట్ కేటాయిస్తామని చెప్పడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఉపాధ్యాయ ప్రమోషన్ లలో కూడా రెండు సబ్జెక్టులకు అర్హత కలిగి ఉంటే దరఖాస్తు పరిశీలనప్పుడు వారిని ఆప్షన్ అడుగుతారని అటువంటిది డిఎస్సి నియామకాల్లో నిరాకరించడం సమంజసం కాదన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పం దించి ఉన్నత న్యాయస్థానం తీర్పును గౌరవించి మెరిట్ ప్రాతిపదికన ఉన్నత పోస్టు కు ఎంపికైన వారికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- సూళ్లూరుపేట: ప్రతి ఇంటి నందు మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇంట్లో సుఖసంతోషాలు వెల్లి విరుస్తాయని సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం నాడు సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి లో నిర్వహించిన నారీ శక్తి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ శ్రీ మాట్లాడుతూ ...ప్రతి ఇంటి నందు మహిళ ఆరోగ్యంగా ఉంటేనే, ఆ ఇంటి నందు ప్రతి కుటుంబ సభ్యుడు ఆరోగ్యంగా ఉంటారని, అంతేకాకుండా ప్రతి మహిళ తమ కుటుంబానికి పెద్దదిక్కు అన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి మహిళ ఆరోగ్యం కోసం అనేక పరీక్షలను ప్రభుత్వ ఆసుపత్రి నందు ఉచితంగా నిర్వహిస్తున్నారని, దీనిలో భాగంగానే సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు, మహిళలకు వారి వయసు రిత్యా, వివిధ దశల్లో వారికి సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ, కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, ప్రతి చోట మహిళలంతా ఈ కార్యక్రమాలలో పాల్గొని అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలోని వైద్యులు కార్యక్రమానికి విచ్చేసిన మహిళలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఆసుపత్రిలోని వైద్య అధికార బృందంతో పాటు ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి ఆకుతోట రమేష్ , బొమ్మన శ్రీధర్,ఏజీ కిషోర్ మాధవ నాయుడు , అలవల శ్రీనివాసులు తో పాటు ఆసుపత్రి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వివాదాలు పరిష్కరించుకోవాలి :తాసిల్దార్ శ్రీదేవి

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : ఏపీఐఐసీ భూములకు సేకరించిన భూములలో వివాదాలు పరిష్కరించుకుని పరిహారం పొందుకోవాలని తహసిల్దార్ శ్రీదేవి తెలిపారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో భూ సేకరణలో తలెత్తిన వివాదాలపై బుధవారం గ్రామసభ నిర్వహించారు, ఈ సందర్భంగా తహసీల్దారి శ్రీదేవి మాట్లాడుతూ గ్రామంలో ఏపీఐఐసీ భూములకు చెల్లించవలసిన భూ పరి హారం కోసం పరిష్కరించుకోవాలన్నారు. గ్రామంలోఇప్పటికే కొంతమంది రైతులకు భూ పరిహారం చెల్లించామని తెలిపారు. పలు కారణాలతో భూ వివాదంతో పరిహారం పొందని రైతులు సుమారు 50 మందికి పరిహారం చెల్లించాలి. రైతులు వాటిని పరిష్కరించే దిశగా ముందుకు రావాలన్నారు. గ్రామసభ ద్వారా రికార్డులను పరిశీ లించి సవరించుకొని భూ పరిహారం అందుకోవాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో వీఆర్వో భాస్కర్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మూగ జీవులకి అందని వైద్యం

పాడే రైతుల ఆవేదన

విశాలాంధ్ర - పుత్తూరు: నారాయణ వనం మండల పరిధిలోని గోవిందప్ప నాయుడు కండ్రిగ గ్రామ పంచాయతీకి చెందిన అరణ్యకండ్రిగ దళితవాడలో రైతు సాయి కుమార్ పాడి ఆవు అనారోగ్యంతో బాధపడుతూ మూలుగుతున్న గత రెండు రోజులుగా అందని వైద్యం. ఎన్నిసార్లు సమాచారం అందించిన ఎలాంటి మూగజీ వాలకి వైద్యం చేపట్టలేదు ప్రతిరోజు మూగజీవులు చాలా అనారోగ్యంతో కొన్ని బాధప డుతూ ఉన్నట్లు ఆయన ఆవేదన వ్యక్తపరిచారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నిసార్లు వైద్య అధికారులకు మొరపెట్టిన స్పందించలేదని ఇప్పటికైనా సంబంధిం చిన శాఖ అధికారులు నుంచి వెంటనే మూగజీవులకి వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అంతిమయాత్రలో పాడె మోసిన చంద్రగిరి ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చంద్రగిరి: ఉమ్మడి చిత్తూరు జిల్లా డిస్ట్రిక్ట్ కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) చైర్మన్, చంద్రగిరి మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు మంగళవారం వేకువఝామున తమిళనాడు లో వనపారం లో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం జిల్లా రాజకీయ వర్గాలను, కార్యకర్తలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. పాడే మోసి ఎంఎల్ఏ పులి వర్తి నాని సోదరుడి రుణం తీర్చుకున్నారు. బుధవారం జరిగిన సుబ్రహ్మ ణ్యం నాయుడు అంతిమ యాత్రలో వేలాది మంది అభిమానులు, కార్య కర్తలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. చంద్రగిరి ఎమ్మె ల్యే పులివర్తి నాని ఆయన భౌతిక కాయాన్ని మోసి తన సోదరుడి రుణం తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లా డుతూ, ఏ పని చెప్పినా ఎందుకు, ఎలా అని అడగకుండా పార్టీకి కట్టుబడి పనిచేసిన అసలైన నాయకుడు సుబ్రహ్మణ్యం నాయు డు అని ఆయన సేవలను స్మరించుకు న్నారు. పార్టీలకు అతీతంగా అభిమానులు భారీగా అంతిమ యాత్రలో పాల్గొన్నారు. చివరి శ్వాస వరకు పార్టీ విధానాలకు, సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న సుబ్రహ్మణ్యం నాయుడు పార్థీవ దేహంపై తెలుగు దేశం పార్టీ జెండాను కప్పి గౌర వంగా వీడ్కోలు పలికారు. పార్టీలకు అతీ తంగా తరలివచ్చిన ప్రజలు, అభిమా నులు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. జోహార్ సుబ్రహ్మణ్యం నాయుడు జోహార్. సుబ్రహ్మణ్యం నాయు డు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ అంతి మయా త్రలో పలువురు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రముఖులు, నాయకులు, కార్యక ర్తలు పాల్గొని సుబ్రమణ్యం నాయుడు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఘనంగా నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు బుధవారం శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ ఆధ్వ ర్యంలో పట్టణంలోని సరస్వతి ఆడిటోరియంలో రక్తదాన శిబిరం జరిగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప, నాయకులు కండ్రిగ ఉమ, శైలజ, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు. తిరుపతి జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప ఆధ్వర్యంలో శ్రీరామ నగర్ కాలనీ వద్ద అన్నదాన కార్యక్రమం జరిగింది. నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా అన్నదానం చేయడం సంతో షంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉమ, హరీష్ రెడ్డి, రమేష్ బాబు, భరత్ కుమార్ నాయుడు,మునీర్ బాషా, ప్రియాంక, అరుణ, ఉమా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-తొట్టంబేడు: వ్యవసాయ భూమి ఉండే రైతులకు పంట రుణాలను ఇస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తొట్టంబేడు మండలం తంగేళ్లపాలెం సింగిల్ విండో అధ్యక్షుడు భాస్కర్ రైతులను కోరారు. బుధవారం సింగిల్ విండో కార్యాలయం వద్ద రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎకరా పొలానికి రూ.3లక్షలు ఇస్తామని... ఈ రుణం ద్వారా పంటలను పెట్టి కాపాడుకోవాలని ఆయన రైతులకు సూచిం చారు. పంట రుణాలు కావాలనుకునే రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని, అటువంటి వారే రుణాలకు అర్హులతారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు స్థానిక మేనేజర్ రాజశేఖర్, సింగిల్ విండో సీఈవో చిరంజీవి కూడా పాల్గొన్నారు. పంట రుణాల గురించి రైతులకు వివరించారు.

రాష్ట్ర తెదేపా నాయకుడు విజయబాబుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - పుత్తూరు : రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబును బుధవారం ఆయన కార్యాలయంలోవడమాలపేట టీడీపీ నాయ కులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూలప్రవీణ్,షబీర్, శివరాయల్, సుబ్రహ్మణ్యం, మురళి, సురేష్,కృష్ణ, కిట్టు రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జెండా మహోత్సవాన్ని జరుపుకోవాలి: ఎమ్మెల్యే పాశిం

విశాలాంధ్ర - గూడూరు : ఆంజనేయ స్వామి జెండా మహోత్స వాన్ని ప్రశాంతమైన వాతావరణంలో ఎవ్వరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలియజే శారు. పట్టణంలోని రోటరీ భవనంలో జండా ఉత్సవ కమిటీ సభ్యుల తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.ఝ గూడూరు పట్టణంలోని రోటరీ భవనంలో శ్రీ ఆంజనేయ స్వామి జెండా మహోత్సవ ఉత్సవ కమిటీ సభ్యులతో డీఎస్పీ గీతా కుమారి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ... దేశంలోనే పేరుగాంచిన మైసూరు తర్వాత రెండవ అతిపెద్ద జెండా మహోత్సవం గూడూరు పట్టణంలో మాత్రమే జరుగుతుందని, ప్రశాంతమైన వాతావరణంలో ఎవ్వరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, డీజే ల వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయని దీనిని దృష్టిలో ఉంచుకుని పోలీసు వారికి సహకరించాలని, జెండా ఊరేగింపులో ఎవరైనా రౌడీయిజం చేసిన, భక్తులకు ఇబ్బంది కలిగించిన సహించేది లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తాసిల్దార్ ఆర్.వి ప్రసాద్, సిఐ లు శేఖర్ బాబు,కిషోర్ బాబు,శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్సై మహేష్, ఎలక్ట్రికల్ ఏఈ ఏడుకొండలు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవులుని పరామర్శించిన సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు

విశాలాంధ్ర-పలమనేరు: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పలమనేరు నియోజకవర్గం కార్యదర్శి కామ్రేడ్ సి. చెన్నకేశవులు స్వగ్రామం అయిన పలమనేరు వారి ఇంటికి వెళ్లి అతని ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి యస్.నాగరాజు మాట్లాడుతూ కామ్రేడ్ చెన్నకేశవులు ఆరోగ్యం మెరుగుపడి యధావిధిగా పలమనేరు నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట పలమనేరు పట్టణ సిపిఐ కార్యదర్శి బుర్ర మంజునాథ్ బాబు, పార్టీ నాయకులు వి.రమేష్, కే.రామమూర్తి, గుడియాత్తం అఖిల భారత యువజన సమైక్య ఏ.ఐ.వై.ఎఫ్ అధ్యక్షులు ప్రకాష్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని కుమ్మరి వీధి ప్రాంతంలో ఉన్న శ్రీ సత్య సాయి సేవా సమితి ఆద్వర్యంలో 80 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రతి నెల 3 వ బుధవారం చెన్నై కి చెందిన అగర్వాల్ ఐ హాస్పిటల్ సిబ్బంది గూడూరుకి వచ్చి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కంటి శుక్లం ఆపరేషన్ అవసరమైన వారిని చెన్నై కి తీసుకు వెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేస్తారన్నారు. గత 5 సంవత్సరాలుగా ఎంతో మందికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి సభ్యులు సురేష్ బాబు ,దాము ప్రతాప్, సుబ్బారావు, ఆనంద్, మల్లికార్జున్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి నాయకుల మధ్య పీఎం పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-కార్వేటి నగరం: కార్వేటి నగరంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75వ జన్మ దినాన్ని పురస్కరించుకొని బుధవారం గోమాత పూజతో ప్రారంభించి, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం శ్రీ బంగారమ్మ ఆలయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ప్రధానమంత్రి పేరు మీద అర్చన చేపట్టారు. అనంతరం ప్రసాదాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరెన్నో జన్మ దినోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానికంగా ఉన్నటువంటి శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల నందు విద్యార్థులకు మిఠాయిలు పంచి మోడీ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామిశెట్టి రాజశేఖర్, గోపి, ప్రసాద్, మధు, రమేష్, టిడిపి నుంచి కొప్పేటి ప్రసాద్, తులసి, హరిబాబు, లోకనాథం, జగన్నాథం, జనసేన పార్టీ నుంచి రాజేష్, కుమారస్వామి, నాగరాజు, సుధా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

విశాలాంధ్ర-గూడూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు రావని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి అనేక కార్యక్రమాలు తీసుకువచ్చారని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్ వెల్లడించారు. పట్టణంలోని జడ్పీ హైస్కూల్లో జరిగిన స్వచ్ఛోత్సవ్ స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గూడూరు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన స్వచ్ఛోత్సవ్ స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ పాల్గొన్నారు. పరిసరాలను శుభ్రం చేశారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ రాబోయే పదిహేను రోజులు ఈ కార్యక్రమం జరుగుతుందని ఎక్కడా చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు పారిశుద్ధ్య సిబ్బంది ప్రతిరోజూ పట్టణంలో ఉండే చెత్తను తొలగించి అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని స్వచ్ఛ రాష్ట్రానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, చంద్రమౌళి, రహీం, ఇజ్రాయిల్, అల్లి భాష, మోహన్, అమరయ్య నాయుడు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు

స్వస్త్ నారి సశక్త్ అభియాన్ నిర్వహించాలి

డాక్టర్ మురళీధర్ రెడ్డి

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలలో స్వస్త్ నారి సశక్త్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రాథమిక వైద్యాధికారి మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం 'స్వస్త్ నారి సశక్త్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి వెంకటేశులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75వ జన్మదిన సందర్భంగా మన రాష్ట్రంలో 'స్వస్త్ నారి సశక్త్ అభియాన్' సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు 15 రోజులు పాటు ఆరోగ్యం పై సూచనలు అందించడానికి సూచించిన తేదీలలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళలు ఆరోగ్యానికి కాపాడి కుటుంబాన్ని బలపరిచే లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేసుకొని మహిళల ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళలను గుండెజబ్బులు, మధుమేహ వ్యాధి, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లను పరీక్ష ద్వారా గుర్తించి రెఫరల్ సేవలు అందించడం జరుగుతుందన్నారు. మహిళలు మరియు కిషోర్ బాలికలను రక్తహీనతను గుర్తించి తగిన చికిత్సలను చేయడం, బాలికలలో రక్తహీనతను గుర్తించి శిక్ష చేయడం కాకుండా గర్భవతులను పరీక్షించి సరైన పోషకాహారం ఆవశ్యకతను గూర్చి జాగ్రత్తలు వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కెఎం రాజా, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు ఎం.సుధాకర్ నాయుడు, సిడిపిఓ దేవకుమారి, మహిళలు పాల్గొన్నారు.

స్కాలర్షిప్ నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ పొందుటకు ముఖ్యమైన ప్రక్రియ ప్రారంభమైందని, తిరుపతి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల యాజమాన్యాలు తమ ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ, కాపు, ఈబీసీ విద్యార్థుల వివరాలను ఫ్రెష్, రిన్యువల్ విభాగాల్లో జ్ఞానభూమి కళాశాల లాగిన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తిరుపతి జిల్లా షెడ్యూలు కుల సంక్షేమ, సాధికారత అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియలో విద్యార్థుల ఆధార్ ఆధారిత అథెంటికేషన్ తప్పనిసరి అని, గ్రామ, వార్డు సచివాలయాల్లో విద్యా సంక్షేమ సహాయకులు (డబ్ల్యూఈఏ) లాగిన్ ద్వారా సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని, ప్రతి కళాశాల యాజమాన్యం ఈ వివరాలను సెప్టెంబర్ 30వ తారీఖు లోపు పూర్తి చేయలని స్పష్టం చేశారు. ఈ స్కాలర్షిప్ ద్వారా అర్హత పొందిన విద్యార్థులకు వారి విద్యను కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అందించబడుతుందని, సకాలంలో నమోదు చేయని విద్యార్థులకు స్కాలర్షిప్ ప్రయోజనం లభించదని ఆ ప్రకటనలో తెలియజేశారు.

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోంది

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దొంగ ఓట్లతో పాలన సాగిస్తున్నారని ఈవీఎంల ద్వారా ప్రభుత్వాలు ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయాలను కూని చేస్తున్నారని శ్రీకాళహస్తి కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశం నందు ఓట్ చోర్ పై ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రజలలోకి ఏ విధంగా తీసుకుని వెళ్లాలి కూటమి ప్రభుత్వం ఓట్ల చోరీ కి ఏ విధంగా పాల్పడుతుంది. ఎన్డిఏ కూటమి ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని ప్రజల కోరిక మేరకే ప్రభుత్వాలు కొలువు అవుతాయని కానీ ఈ ఎన్డీఏ కూటమి ఈవీఎంల ద్వారా ప్రభుత్వాలు ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయాలను కూని చేస్తున్నారని ఈ ఓట్ల చోరీ పై కాంగ్రెస్ పార్టీ న్యాయం జరిగే వరకూ పోరాటం జరుగుతుందని తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త వెంకటాచలపతి, సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బల్ల హరి, శ్రీకాళహస్తి నియోజకవర్గం సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, గూడూరు నియోజకవర్గ సమన్వయ కర్త భాస్కర్, తిరుశ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భవతులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు ప్రాజెక్ట్ ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసం సెప్టెంబర్ 17వ తారీకు నుండి అక్టోబర్ 16వ తారీకు వరకు స్వస్థనారి స్వశక్తి పరివార్ అభయాన్ కార్యక్రమం లో భాగంగా తొలి రోజు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి లోని పుత్తూరు మండలంలోని యూపిహెచ్సి గోవిందపాలెం నందు మరియు పిహెచ్సి పిఆర్ మంగళం పరిధిలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరపడమైనది అందులో భాగంగా లబ్ధిదారులైన గర్భవతులు మరియు బాలింతలు, తల్లులకు చిన్నపిల్లల ఆహారపు అలవాట్ల పద్ధతుల గురించి వారు తీసుకోవలసిన పోషకాహారంపై అవగాహన ఇవ్వడమైనది ఆకుకూరలు కాయగూరలు సీజనల్ పండ్లు అధిక మొత్తంలో తీసుకొని అంగన్వాడీ కార్యక్రమంలో చక్కెర, ఉప్పు మరియు నూనె తగ్గించివున్న ఆహారం తీసుకుంటే ఊబకాయాన్ని మరియు రక్తహీనతను అరికట్టవచ్చు. ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాది ఇందులో పురుషుల భాగస్వామ్యం చేయడమైనది ఈ కార్యక్రమం ముఖ్య ఉదేశం, మరియు బాల్య దశ సంరక్షణ మరియు విద్య పోషణ బి పడాయి బి కార్యక్రమంలో భాగంగా 0 నుంచి 3 సంవత్సరాల పిల్లలకు నవచేతన 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ శిల ప్రి స్కూల్ కార్యక్రమాల మరియు అందవలసిన పోషకాహారం మరియు చిన్నపిల్లలకు పూర్వప్రదామిక విద్య ప్రాముఖ్యత పైన ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.సంధ్య అవగాహన కల్పించారు మరియు పోస్టర్స్ విడుదల చేయడం జరిగినది పైన జరిగిన రెండు కార్యక్రమాలలో సూపర్వైజర్ శ్రీదేవి మరియు అనిత యూపిహెచ్సి డాక్టర్ కేవై రమేష్ మెడికల్ ఆఫీసర్ మరియు వైద్య సిబ్బంది పిఆర్ మండలం పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హేమ భూషణ్ రెడ్డి. డాక్టర్ కే.సాయి చరణ్, పిహెచ్ఎన్ విజయ కుమారి, హెల్త్ సూపర్వైజర్ ఉమా కుమారి, ఏఎన్ఎం మరియు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వినతి

విశాలాంధ్ర-పుంగనూరు: ఉమ్మడి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బాణావతి మునీంద్ర నాయక్ బుధవారం అమరావతిలోని గవర్నర్ బంగ్లాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి తిరుమల దేవస్థానంలో ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాక్ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరడం జరిగిందన్నారు అలాగే గిరిజన ప్రాంతాల్లో తిరుపతి తిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో గిరిజన గోవిందం కార్యక్రమాలు నిర్వహించాలని కోరడం జరిగిందన్నారు ఈ విషయంపై గవర్నర్ అబ్దుల్ నజీర్ సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు అందుకని ఆయనకి కృతజ్ఞత అభినందనలు తెలియజేశామన్నారు ఈ కార్యక్రమంలో రామకృష్ణ రాజ్ కుమార్ శ్రీనివాసులు సరస్వతమ్మ హరికృష్ణ నాయక్ పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారందరికీ గుర్తింపు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసి వారందరికీ కూటమి ప్రభుత్వంలో తప్పక గుర్తింపు లభిస్తుందని టిడిపి పట్టణ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు అన్నారు. పిఏసిఎస్ అధ్యక్షులుగా బాధ్యతలు తీసుకున్న కాపు గున్నేరు పిఏసిఎస్ అధ్యక్షులు చల్లపాలెం బత్తి రెడ్డిని పట్టణ టిడిపి అధ్యక్షులు జి విజయ్ కుమార్ తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్, తొట్టంబేడు మాజీ యువత అధ్యక్షులు గుప్తా విజయ్ నాయుడు,హిమాత్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ కష్టపడిన వారికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని కష్టపడిన వారిని గుర్తించి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి వీరికి సముచిత స్థానం కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ సీనియర్ శ్రేణులు కంఠా రమేష్ పాల్గొన్నారు.

వేమాలమ్మను దర్శించుకున్న బొజ్జల బృందమ్మ

విశాలాంధ్ర-తొట్టంబేడు: మండలంలోని చియ్యవరం గ్రామం లో బుధవారం గ్రామ దేవత వేమలమ్మ తల్లి ఆలయ కుంభాభిషేకానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ పాల్గొని అమ్మవారికి సారె సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు రాఘవులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-సోమల: సోమల మండలంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఘనం గా కూటమి పార్టీ నాయకులు, ప్రజలు నిర్వహించారు. జన్మదిన సందర్భంగా సోమల బస్టాండ్ నందు మోడీ అభిమానులు భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు టిడిపి నాయకులు, కార్యకర్తలు జనసేన నాయకులు, కార్యకర్తలు కలసి కేక్ కట్ చేయడం జరిగింది. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంచడం జరిగింది. సోమల ప్రభుత్వ హైస్కూల్ నందు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పెద్ద ఉప్పరపల్లి బస్టాండ్ నందు మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచడం బాణసంచా కాల్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ గన్న మదన్ మోహన్ బాబు. బిజెపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ విశ్వనాథ నాయుడు, సోమల మండల అధ్యక్షుడు హిమగిరి రాయల్, జనసేన మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం, టిడిపి నాయకుడు ఉమాపతి నాయుడు, మండల మాజీ ఉపాధ్యక్షులు శీలం రామ్మూర్తి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస నాయుడు, మండల కిషన్ మోర్చా అధ్యక్షుడు రామ్మూర్తి మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం బుధవారం ప్రారంభించినట్లు సీడీపీవో శాంతిదుర్గ తెలిపారు. పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆమె చెప్పారు. మహిళలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తామని శాంతిదుర్గ వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాలు, ఎంఈవో భువనేశ్వరి, వార్డు సభ్యులు మోహన్, సూపర్ వైజరు హరిత, మంజుల అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-కార్వేటినగరం: దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ భువనేశ్వరీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని డీఎం పురం ఆయుష్మాన్ ఆరోగ్య భవనంలో ప్రారంభించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో వైద్యాధికారిణి మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధుల పట్ల రోగులు అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత అధికారుల వద్ద వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేసినా ప్రాణహాని వాటిల్లే అవకాశం ఉంటుందని చెప్పారు. అదే విధంగా జంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తల ఆధ్వర్యంలో బాలింతలు తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. హైపర్ టెన్షన్ డయాబెటిక్, హెబీ స్క్రీనింగ్, నిశ్చయ ఐడీ, ఎన్సీ పరీక్షలు, టీబీ స్క్రీనింగ్, సికిల్ సెల్ ఆనీమియా పరీక్షలతో పాటు, క్యాన్సర్ స్క్రీనింగ్ బ్రెస్ట్, సర్వైకల్ ఓరల్ పరీక్షలు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు ఎస్.ప్రియాంక. సీహెచ్ రాజేశ్వరీ, పీహెచ్ఎన్ గౌర్, పర్యవేక్షకులు త్యాగు. ఐసీడీఎస్ సూపర్వైజర్ రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాలుకు కొలతలు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాలు (ఆర్టిఫిషియల్ లింబ్స్) క్యాంప్ నందు కాలు కొలతలు తీసుకోవడం జరుగుతుందని, కావున కృత్రిమ కాలు కావలసిన అర్హులు 9989206667, 9000010390, 9885529768, 9347131683, 8500930530 అర్హత కలిగిన వారు నెంబర్లను సంప్రదించి తమ వివరాలను నామోదు చేసుకోవాలని, అర్హులు సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా విభిన్న ప్రభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ప్రకటనలో తెలియజేశారు.

సీసీ కెమెరాలు పటిష్టపరచాలి

డి.ఎస్.పి నరసింహమూర్తి

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: నేరస్తుల ఆనవాళ్లను గుర్తించేందుకు ఉపయోగపడే సీసీ కెమెరాలు పటిష్టపరచాలని శ్రీకాళహస్తి డి.ఎస్.పి నరసింహమూర్తి పోలీసులను కోరారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను శ్రీకాళహస్తి డీ.ఎస్పీ నరసింహమూర్తి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్ఐని ఆదేశించారు. అలాగే స్టేషన్ పరిసరాలను పరిశీలించి సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధి నిర్వహణలో ముందుండాలన్నారు. అనంతరం సిఐ, ఎస్ఐలతో మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు, అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపాలన్నారు. బజారు వీధిలో రాత్రులు బీట్ సిస్టం బలోపేతం చేసి నేరాలకు నియంత్రణ అడ్డుకట్ట వేయాలన్నారు, అనంతరం జనరల్ డైరీ, కోర్టు క్యాలెండర్, కేసు నమోదు రిజిస్టర్లు పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు అందించారు. బ్లూ కోల్ట్స్ రక్షణ వాహనాలు నిరంతరం గస్తీ ఏర్పాటు చేయాలన్నారు డయల్ 112 ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని క్రమశిక్షణతో సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. సిఐ తిమ్మయ్య, ఎస్సై విశ్వనాథ నాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం నూతన ఎంపీడీవోగా వనజ

విశాలాంధ్ర-ఎస్ఆర్ పురం: పంచాయతీ రాజ్ శాఖ సీఈవో ఉత్తర్వుల మేరకు నారాయణవనం మండలం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న వనజ బుధవారం ఎస్ఆర్ పురం మండలం ఎంపీడీవోగా బాధ్యతలను స్వీకరించారు. తాజా బాధ్యతలు స్వీకరించే కార్యక్రమం ఎస్ఆర్ పురం ఎంపీడీవో కార్యాలయం లో ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు ఆమెకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వనజ మాట్లాడుతూ ఎస్ఆర్ పురం మండల అభివృద్ధికి తన వంతు పాత్రను కృషితో నెరవేర్చేందుకు పూర్తి ప్రయత్నం చేస్తానని" వెల్లడించారు. ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, అందరికీ సముచిత సేవలు అందించే దిశగా కార్యాచరణ జరుపుతానని పేర్కొన్నారు. ఏవో మురళీమోహన్, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది పాల్గొని వనజకి శుభాకాంక్షలు తెలిపారు.

పశువుల్లో గాలికుంటువ్యాధి నిరోధక టీకాతో తగ్గే పాల ఉత్పత్తిని నివారించవచ్చు

విశాలాంధ్ర-సత్యవేడు: గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయడం వల్ల పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించుకోవచ్చునని సత్యవేడు మండలం ఇరుగుళం వెటర్నరీ డాక్టర్ దయాకర్ చెప్పారు. బుధవారం స్థానిక పశు సంవర్ధక శాఖ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో ఆయన పలు పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ పశువులు తీవ్రమైన జ్వరం, నోటి నుంచి చొంగ, నోరు కాలి గిట్టలు మధ్య పుండ్లు వంటివి రావడం గాలికుంటు వ్యాధి లక్షణాలుగా ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తద్వారా వ్యాధి సోకిన మగ పశువుల్లో కూడా తగ్గే పని సామర్థ్యాన్ని పూర్తిగా అరికట్టవచ్చును అన్నారు. తొలి రోజు బుధవారం 780 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మండలంలో 5476 పశువులకు 4365 ఐర్రెలకు టీకాలు వేయాల్సి ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు పలువురు పాల్గొన్నారు.

ఆయమ్మల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు మరియు ఆయమ్మలకు కనీస వేతనంతో కూడిన జీతం నెలకు 18000 ఇవ్వాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. 2005వ సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శుభ్రం చేయటం బాత్రూంలు కడగటం కోసం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలో 42 వేల మంది కార్మికుల నియమించింది. వీరు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు రోజుకు నాలుగు సార్లు బాత్రూం క్లీన్ చేయటం నాడు నేడు కార్యక్రమంలో స్కూల్స్ లో ఎక్కువగా టాయిలెట్ నిర్మించడం జరిగింది. దీనివల్ల కార్మికులకు పనిభారం ఎక్కువవుతుంది అయినా నెలకు 6000 రూపాయలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది. పాఠశాల పనిచేసే వారు మహిళ కార్మికులైన మెడికల్ లీవ్ కూడా ఇచ్చే పరిస్థితుల్లో లేదు. ఒకటి నుండి 300 విద్యార్థులు ఉన్నవారికి ఒక ఆయాని ప్రభుత్వం నియమించింది. దీనికి తోడు రాజకీయ వేధింపులు ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత చాలాచోట్ల ఆయమ్మలను తొలగించినారు. 2015వ సంవత్సరంలో ఇదే తెలుగుదేశం ప్రభుత్వం నియమించిన వారిని మళ్లి ఇప్పుడు ఇదే తెలుగుదేశం పార్టీ తొలగించడం చాలా దారుణం వెంటనే తొలగించిన కార్మికులను విధిలో తీసుకోవాలని వీరికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, టాయిలెట్‌కి సంబంధించిన చీపుర్లు సబ్బులు ఫినాయిల్ అందజేయాలని బుధవారం తిరుపతి శాసనసభ సభ్యులు శ్రీనివాసులుకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.మహేంద్ర తిరుపతి జిల్లా ఆయాల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏ.సుశీల, వి.లాజరస్, జి.లక్ష్మి తదితరులు ఉన్నారు.

టిడిపి నాయకుడికి పులివర్తి నాని నివాళి

విశాలాంధ్ర-పాకాల: పాకాల మండలంలో మంగళవారం మృతి చెందిన టిడిపి నాయకుడికి చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని నివాళులర్పించారు. పాకాల మండలం పెద్ద గోర్పాడు గ్రామ పంచాయతీ పెద్ద గోర్పాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నారాయణమ్మ భర్త సూరినేని రామకృష్ణమ నాయుడు మంగళ వారం మృతి చెందాడు. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని స్థానిక నాయకులతో రామకృష్ణమ నాయుడు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టుబడ్డ వాహనాలకు నేడు వేలంపాట

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మొత్తం 37 మోటార్ సైకిళ్లు, 1 స్కార్పియో కార్, మరియు 1 మారుతి కార్ ను రేపు ఉదయం 10:00 గంటలకు వేలం పాట ద్వారా విక్రయించనున్నారు. ఈ కార్యక్రమం గుడిపాల ఎమ్మార్వో, చిత్తూరు డీఎస్పీ, మరియు వెస్ట్ సిఐ వారి సమక్షంలో నిర్వహించబడనుంది. వేలంపాటలో పాల్గొనాలనుకునే వారు ముందుగా మోటార్ సైకిల్ కు రూ.2000 మరియు కారు కోసం రూ.5000 డిపాజిట్ చేయించి వారి పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు రేపు ఉదయం నిర్దేశిత సమయంలో గుడిపాల పోలీస్ స్టేషన్ వద్ద హాజరు కావాలి అని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

ఘనంగా ప్రధానమంత్రి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-సత్యవేడు: పట్టణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను భాజపా నేతలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద మండల భాజపా అధ్యక్షులు సత్యవేడు బాలాజీ ఆధ్వర్యంలో పలువురు నేతలు కేకను కట్ చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ పేద, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఏకైక నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు మోహన్ బాబు, వెంకటేశులు, నరేంద్ర, శ్రీకాంత్, వినోద్, గిరిధర్, రవి పద్మప్రియ, రాజ, దినకర్, పార్థసారథి, భువనేశ్వర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ మోదీ సంకల్పం దేశానికి స్ఫూర్తి

విశాలాంధ్ర-గూడూరు: దేశ ప్రజల సంక్షేమం, వికసిత్ భారత్ కోసం ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పం దేశ ప్రజలకు స్ఫూర్తి అని గూడూరు అర్బన్ మండల బిజెపి అధ్యక్షులు కే దయాకర్ పేర్కొన్నారు. మంగళవారం గూడూరు రెండో పట్టణ పట్టణ పరిధి నరసింగరావుపేటలో ఉన్న బిజెపి కార్యాలయం లో అర్బన్ మండల అధ్యక్షులు కే దయాకర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి దేశ ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దయాకర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలబడేలా ప్రధాని నరేంద్ర మోదీ పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ నాయుడు, జిల్లా మహిళా నాయకురాలు బిందు రెడ్డి, గూడూరు అర్బన్ మండలం బిజెపి ప్రధాన కార్యదర్శి రవీంద్ర, కోశాధికారి నిరంజన్, ఉపాధ్యక్షులు గుమ్మడి శ్రీనివాసులు, ఐ సురేష్ బాబు, నీలి ధనంజయ, భార్గవ్, ఓబీసీ మోర్చా నాయకులు కటకాల సురేష్, డివిఎంసి మాజీ సభ్యులు, బిజెపి నాయకులు దాసరి వెంకటేశ్వర్లు యువమోర్చా నాయకులు శివకుమార్, నాయకులు రమేష్, బాబు, మహిళా మోర్చా నాయకులు బాలామణి, తూపిలిలక్ష్మి భవాని పాల్గొన్నారు.

రాష్ట్రీయ పోషణ మాహ్ ప్రారంభం

విశాలాంధ్ర-వెంకటగిరి: విజ్ఞాన కేంద్రం వారి సమన్వయంతో బుధవారం అన్ని పబ్లిక్ హెల్త్ సెంటర్స్ నందు 8వ రాష్ట్రీయ పోషణ మాహ్ ప్రారంభించడం జరిగినది. బంగారుపేట పబ్లిక్ హెల్త్ సెంటర్ నందు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ తనూజా రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్ వెంకటగిరి గుణ శేఖర్ రెడ్డి, వెంకటగిరి ప్రోగ్రాం ఆఫీసర్ హరిత, డిఎం హెచ్ఓ, కెవికె తరఫున బి.విజయశ్రీ హాజరైనారు. ఈ సందర్భంగా ఎస్.కె.శంషాద్ బేగం మాట్లాడుతూ వంటకాలలో చక్కెర, నూనె తగ్గించడం వలన పిల్లలను స్థూలకాయం నుంచి కాపాడుకోవచ్చునని, అలాగే పిల్లలకు చిన్నతనం నుంచి జంక్ ఫుడ్ స్థానంలో సరైన పౌష్టికాహారం ను క్వాలిటీగా, ఫ్రిక్వెన్సీ, వెరైటీ గా పిల్లలకు అందించాలన్నారు. అలాగే పోషణ్ భీ పడాయి భీ అనే అంశం పై, అలాగే గ్రామీణ శక్తి కి మార్గం పోషణ కి బలమైన పునాది స్థానికానికి మద్దతు, అనే అంశం పై, స్కూల్ విద్యార్థులకు, అంగన్వాడి కార్యకర్తలకు, హెల్త్ వర్కర్స్ కి అవగాహన కల్పించడమైనది. స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అనే అంశం పై ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిత మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలని, గర్భిణీ గా ఉన్నప్పుడు తప్పనిసరిగా 4 సార్లు హెల్త్ చెకప్స్ చేయించుకోవాలని కోరారు.

డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రిచే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లా నుంచి డీఎస్సీ (డీఎస్సీ) ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ మంజూరు చేయనున్నట్లు తిరుపతి జిల్లా విద్యా శాఖ అధికారి కేవీఎన్. కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ అభ్యర్థుల రిజిస్ట్రేషన్ కోసం చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రత్యేక రిజిస్ట్రేషన్ కేంద్రం ఏర్పాటు చేయబడినదని, అభ్యర్థులు సెప్టెంబర్ 18 ఉదయం 7 గంటలకు కాలేజీ వద్దకు ఫోటో, గుర్తింపు కార్డు (ఆధార్ కార్డు వంటి వాటితో కాల్ లెటర్‌తో హాజరై రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసిన తరువాత అభ్యర్థులకు ఒంగోలులో రాత్రి వసతి కల్పించబడుతుందని, తదుపరి ప్రత్యేక బస్ సౌకర్యం ద్వారా విజయవాడకు తరలింపుచేసి, అక్కడ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందజేయబడతాయని, అనంతరం అభ్యర్థులను తిరుపతికి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. జిల్లా విద్యా శాఖ అధికారి కెవిఎన్ కుమార్ అభ్యర్థులను సమయపాలనతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొనాలని ఆ ప్రకటనలో తెలియజేశారు.

వైభవంగా తెప్పోత్సవం

విశాలాంధ్ర-పూతలపట్టు: వినాయక స్వామి వారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు భాగంగా చివరి రోజు తెప్పోత్సవం సందర్భంగా శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఉత్సవమూర్తులను పుష్కరి నందు వైభవంగా తెప్పోత్సవం నిర్వహించడం జరిగింది. స్వామివారికి ప్రత్యేక హారతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్, దేవస్థానం పెంచల కిషోర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వస్త్ నారీ సశక్త్ పరివార్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ఆరోగ్యవంతులైన మహిళలతోనే బలమైన కుటుంబం అనే నినాదంతో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ఈ నెల 17 నుండి అక్టోబర్ 02వ తేదీ వరకు పదిహేను రోజుల పాటు నిర్వహిస్తున్నందున మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాదవరెడ్డిలు పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంకు హాజరయ్యారు. మహిళలకు పౌష్టికాహారం పంపిణీ చేసి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజున మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా పేదరికంతో ఇబ్బంది పడుతున్న మహిళలు అందరికీ మంచి జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మహిళలు, బాలికలకు బిపి, షుగర్, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడమే కాకుండా పోషణ అభియాన్, తల్లీబిడ్డల సేవలు, వృద్ధులకు పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలతో పాటు క్షయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు, బాలికలు తప్పక వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి పేరుతో మొక్కలు నాటి పెంచండి

విశాలాంధ్ర-చిల్లకూరు: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ పుట్టినరోజు సందర్భంగా, బుధ వారం ఏక్ పేడ్ మా కే నామ్ 2.0 అనే నినాదంతో 2000 పండ్ల మొక్కలు నాటే బ్రుహత్తర కార్యక్రమానికి సింహపురి విద్యుత్ పరిశ్రమ మరియు జిందాల్ ఫౌండేషన్ యాజమాన్యం వారు శ్రీకారం చుట్టడం జరిగింది. తమ్మినపట్నం మరియు లింగవరం గ్రామ పంచాయతీలకు చెందిన గ్రామాల్లో మామిడి, సపోటా మరీ జామ మొక్కలు నాటడం జరిగింది. ఈ మొక్కలు భవిష్యత్తు లో పెద్ద చెట్లు గా మారి తినేందుకు నాణ్యమైన ఫలాలను అందించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు చేస్తాయని పరిశ్రమ అధిపతి ఎస్. ఏ. మన్సూరి తెలిపారు. సర్పంచ్ నెల్లిపూడి సుబ్రమణ్యం మరియు ప్రజాప్రతినిధులు తమ సహకారాన్ని సంపూర్ణంగా అందించారు. పంచాయతీ కార్యదర్శి మరియు గ్రామ పెద్ద కాపులు, మత్స్యకారులు, ప్రజలు తమ మద్దతు తెలిపారు. 2000 మొక్కలు నాటే కార్యక్రమంలో 300 మొక్కలు ఈ రోజు నాటడం జరిగింది. మిగిలిన 1700 మొక్కలను సెప్టెంబర్ 25 లోపల పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు పోతామని తెలిపారు.

యోగా, చెస్‌లతో మానసిక ఏకాగ్రత సాధ్యం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: యోగ చెస్ క్రీడలతో ఏకాగ్రత సాధ్యమవుతుందని మండల విద్యాశాఖ అధికారి భువనేశ్వరి అన్నారు. పట్టణంలోని ఆర్పిడిఎస్ జిల్లా పరిషత్ బాలురన్న పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి యోగ, చెస్ పోటీలను నిర్వహించారు. అండర్ 14 అండర్ 17 విభాగాలు కింద నిర్వహించిన ఈ పోటీలను ఎంఈఓ ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ యోగా చెస్ వంటి ఆటల్లోనూ ప్రతిభ కనబరచాలని చెప్పారు. మండల స్థాయిలో రాణించి అదే స్ఫూర్తితో డివిజన్ జిల్లా స్థాయిలోనూ ఖ్యాతి గడించాలని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కిషోర్ మండల కోఆర్డినేటర్ జేమ్స్ ఎంఈఓ 2 బాలయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, పీఈటీలు రమణ, వెంకట ముని, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద పరిస్థితిలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండలంలోని బొమ్మసముద్రం గ్రామం హరిజనవాడకు చెందిన సామ్యేల్ కుమారుడు రాజేష్ అనే వ్యక్తి మంగళవారం రాత్రి అనుమానాస్పద పరిస్థితిలో మృతి చెందినట్లు సమాచారం. రాజేష్ ద్విచక్ర వాహనంలో ఇంటికి తిరుగుతూ మార్గమధ్యంలో అదుపుతప్పి బావిలో పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సందర్భాన్ని పరిశీలించేందుకు గుడిపాల పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామ్మోహన్, అగ్నిమాపక సిబ్బంది తక్షణ స్పందనతో సంఘటన స్థలానికి చేరుకుని బావిని గాలింపు చేశారు. గాలింపు చర్యల్లో ద్విచక్ర వాహనం తేలిపోయినప్పటికీ, ఇప్పటివరకు గుర్తింపు పొందిన వ్యక్తి ఎవరూ కనిపించలేదని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం గుడిపాల పోలీసులు సంఘటన స్థలంలో గాలింపు చర్యలను తీవ్రంగా కొనసాగిస్తున్నారు. కేసు పట్ల మరిన్ని వివరాలు త్వరలో విడుదల చేయనున్నట్టు వారు తెలియజేశారు. ఈ ఘటన స్థానిక ప్రజలలో కలవరాన్ని సృష్టించింది. పోలీసులు దృష్టిపెట్టి విచారణ కొనసాగిస్తున్నారు.

ఆరోగ్య కేంద్రంలో సామాజిక సేవా

విశాలాంధ్ర-ఎస్ఆర్ పురం: భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకను పురస్కరించుకుని రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఎస్ఆర్ పురం మండల ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చిన రోగులకు బ్రెడ్లు, పండ్లు, పళ్ళ రసాలు లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎస్ఆర్ పురం బిజెపి మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్ర డాక్టర్ ద్వారా సమర్థవంతంగా నడిపించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఇన్చార్జ్ రాజేంద్ర హాజరై ప్రసంగం చేశారు. అలాగే మండల అధ్యక్షులు జిల్లా జ్యోతి రెడ్డి, మండల జనరల్ సెక్రటరీ నాగరాజు, మండల ఉపాధ్యక్షులు వాసు, మునినారం, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు వెంకటేష్, జిల్లా యువ మోర్చా సెక్రటరీ చంద్రశేఖర్, కరుణాకర్, రాధాకృష్ణ, కృష్ణారెడ్డి, తులసమ్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ప్రజల మధ్య ప్రధాని మోదీ సంకల్పాలు, దేశాభిమానం, సమగ్ర అభివృద్ధికి ఆయన చేసిన పాత్రపై అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా ఆరోగ్య రంగంలో ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, అందరికీ ఆరోగ్య సేవల సమాన హక్కుల మీద దృష్టి సారించారు.

మేరిగ లీలావతమ్మకు ఎమ్మెల్సీ నివాళి

విశాలాంధ్ర-రామచంద్రాపురం: మండలంలోని తిమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన స్టేట్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ మేరిగ వేణుగోపాల్ రాజు, మేరిగ వాసుదేవ రాజు మాతృమూర్తి మేరిగ లీలావతమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం మృతురాలి స్వగృహంలో ఆమె తమ్ముడు న్యాయవాది లీలాకృష్ణ ఆధ్వర్యంలో కర్మక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తో పాటు పలువురు ప్రముఖులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వేణుగోపాల్ రాజు, వాసుదేవ రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మధుసూదన రావు, బాలాజీ, డాక్టర్ రాజేష్ కుమార్, డిటి చిన్నబ్బు, మన్మధరావు, తారకరాము, ముని భాస్కర్ రెడ్డి, మునిరత్నం నాయుడు, తానికొండ నరసింహులు నాయుడు, శాంతి ఆశ్రమం పీఠాధిపతి వెంకట రెడ్డి, శ్యాం ప్రసాద్, పరమానందం, రమణమ్మ, బాలాజీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రధానమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-వెదురుకుప్పం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదిన వేడుకలను వెదురుకుప్పం మండల కేంద్రం లో బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బిజెపి, టిడిపి నేతల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టిడిపి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గురుసాల కిషన్ చంద్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు చాణిక్య ప్రతాప్, టీడీపీ మండల అధ్యక్షుడు లోకనాథ రెడ్డి, బిజెపి ఉపాధ్యక్షులు సోమురాజు, కూటమి నాయకులు ,మురళి రెడ్డి, శంకర్ రెడ్డి,కనకమ్మ, రామకృష్ణ రెడ్డి, బాలాజీ, గోపి, హనుమంత్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, రాజేంద్ర రెడ్డి, కోశాధికారి మురళి, గుణశేఖర్ రెడ్డి,నరసింహ రెడ్డి,మురళి, తిరుమల రెడ్డి, ప్రకాష్, శేఖర్, విజయ్, గోవింద రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవిత్ర మాలల ఊరేగింపు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే పవిత్రోత్సవాల్లో రెండవ రోజున బుధవారం పవిత్ర మాలలు ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయంలోని మూలమూర్తితో పాటు పరివార దేవతామూర్తులకు సమర్పించే పవిత్ర మాలలను ఆలయ వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ, ఆయన సోదరుడు చెవిరెడ్డి రఘునాథ రెడ్డి, మంజుల దంపతులతో ఇతర కుటుంబ సభ్యులు పవిత్ర మాలలను ఊరేగింపుగా తీసుకువచ్చి యాగ శాలలోని వేద పండితులకు సమర్పించారు. అప్పటికే జరుగుతున్న వైదిక క్రతువులతో పాటు పవిత్రమాలలకు ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. కనువిందుగా స్నపన తిరుమంజనం... పవిత్రోత్సవాల్లో రెండవ రోజైన బుధవారం మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులకు ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు.

మార్కెట్ లోకి హీరో నూతన బైక్

విశాలాంధ్ర-పాకాల: మార్కెట్లోకి బుధవారం నుండి హీరో కంపెనీ కి చెందిన నూతన బైక్ వచ్చినట్లు శివ హోండా అధినేత శశికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పట్టణంలోని చిత్తూరు రోడ్డు నందు గల శివ హోండా షోరూం నందు నూతనంగా మార్కెట్లోకి వచ్చిన హీరో షైయిన్ 100 డిఎక్స్ బైక్ ను శశి కుమార్ ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బైకు అత్యాధునిక టెక్నాలజీ మరియు ఫ్యూచర్స్ కలిగి ఉన్నదని దీని ఎక్స్ షోరూం ధర 69,692 మాత్రమేనన్నారు. ఈ బైక్ నేటి నుండి అన్ని శివ హోండా షోరూమ్ లలో అందుబాటులో ఉంటుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

రామాపురంలో పౌష్టికాహార మహోత్సవాలు

విశాలాంధ్ర-తడ: సూళ్లూరుపేట స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార మహోత్సవాలు సెప్టెంబర్ 17 వ తారీకు నుండి అక్టోబర్ 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సిడిపిఓ జ్యోతి కిరణ్ తెలియజేశారు. బుధవారం తడ మండలం పరిధిలోని రామాపురం ప్రభుత్వ హాస్పిటల్ మరియు కారూరు అంగన్వాడి కేంద్రం లలో పౌష్టికాహార మహోత్సవాలు నిర్వహించారు. గర్భవతులు బాలింతలు అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ఆరోగ్యం పట్ల వ్యక్తిగత పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించాలని పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించకపోవడం వల్ల తరచూ అనారోగ్యానికి గురవుతారని స్థానికంగా దొరికే పండ్లు కూరగాయలు ఆహారంగా తీసుకోవాలని అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ మస్తాన్, రామాపురం సర్పంచ్ టీకే శ్రీనివాస్, సిడిపిఓ జ్యోతి కిరణ్, సూపర్వైజర్ లక్ష్మీ నారాయణమ్మ, గర్భవతులు బాలింతలు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం శ్రీ స్వామి వారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు భాగంగా చివరి రోజు రాత్రి తెప్పోత్సవం ముగిసిన అనంతరం స్వామివారికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్, దేవస్థానం పెంచల కిషోర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఆదర్శంగా నిలిచిన విశ్వం విద్యార్థులు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచే దిశగా చేపట్టిన ఈ కార్యక్రమంలో విశ్వం స్కూల్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్. మౌర్య,ఆంధ్రా ప్రదేశ్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్, మన్నూరు సుగుణమ్మ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ "స్వచ్ఛమైన పరిసరాల ద్వారానే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం సాధ్యం. పరిశుభ్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యత. ముఖ్యంగా యువతరం ముందుకు వచ్చి సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే సామాజిక బాధ్యతా భావం పెంపొందించడం అత్యవసరమని, స్వచ్ఛత అంటే కేవలం శుభ్రత మాత్రమే కాదు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మరియు సమాజానికి సేవ చేయడం అని అన్నారు.ఈ సందర్భంగా విశ్వం విద్యార్థులు స్వచ్ఛతపై నినాదాలు పలుకుతూ, శుభ్రతా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరి ప్రశంసలు అందుకున్నారు. "మా నగరం – మా బాధ్యత" అనే నినాదంతో తాము ఎల్లప్పుడూ సేవ చేసేందుకు సిద్ధంగా ఉంటామని విద్యార్థులు తెలిపారు.కార్యక్రమంలో తిరుపతిలోని ప్రముఖ నాయకులు,వివిధ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో విజేతలు వీరే

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల పోటీలను ఎంఈఓ సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు, బాలికలు ఎస్ మనోరంజని, డి.దేశమ్మ లాంచనంగా ప్రారంభించారు. మండలం లోని 17 పాఠశాలల నుండి సుమారు 400 మంది విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు. మొదటిరోజు జరిగిన పోటీలలో అండర్ 14 వాలీ బాల్ పోటీలలో బైరెడ్డిపల్లి జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మొదటి స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కడపనత్తం ద్వితీయ స్థానం, అండర్ 14 బాడ్మింటన్ లో బైరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు మొదటి స్థానం, కడపనత్తం ద్వితీయ స్థానం అండర్ 14 ఖో ఖో లో తీర్థం మొదటి స్థానం, నెల్లిపట్ల ద్వితీయ స్థానం, అలాగే అండర్ 17 వాలీ బాల్ పోటీలలో బైరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు మొదటి స్థానం, కడపనత్తం ద్వితీయ స్థానం బాలికల విభాగం లో గురుకుల పాఠశాల కమ్మనపల్లి మొదటి స్థానం, కడపనత్తం ద్వితీయ స్థానం, అండర్ 17బాలుర ఖో ఖో లో బైరెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల బాలురు మొదటి స్థానం, ఆగస్తి పబ్లిక్ స్కూల్ ద్వితీయ స్థానం లో నిలిచారు. రేపు 18/9/25 నా కబడ్డీ, యోగ, చెస్, అథ్లెటిక్స్ జరుగును.ఈ కార్యక్రమం లో పీడీ లు చిరంజీవి,, సుజాత, షాహినా, శాంతి, మోహన్, ప్రవీణ, తరుమ్ తాజ్ పాల్గొన్నారు.

దేవుళ్ళతో ఆటలాడొద్దు భూమనా: డా.యం.ఉమేష్ రావు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: హిందూమత ప్రజల జీవితాలను గందరగోళ పరిస్థితుల లోకి వెళ్ళేలా చేయడం ద్వారా పైశాచిక ఆనందాన్ని పొందాలని చూస్తున్న భూమన కరుణాకర్ రెడ్డి దేవుళ్ళతో ఆటలాడటం మానుకోవాలని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం.ఉమేష్ రావు హెచ్చరించారు.శనీశ్వరుడికి విష్ణుమూర్తికి తేడా తెలియని నాస్తిక మూర్ఖ శిఖామణి కరుణాకర్ రెడ్డి, హిందుత్వం గురించి మొసలి కన్నీరు కారుస్తూ ఎవరో ప్రైవేటు వ్యక్తులు చేయించుకున్న శనీశ్వర విగ్రహం బాగా రాలేదని వదిలి వెళ్ళిపోతే సంబంధం లేని టీటీడీపై అభాండాలు వేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బ తగిలేలా చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. భూమన కుటుంబం ఆచరించే మత విశ్వాసాలు వేరని, తన రాజకీయ ఉనికి కోసం, ధనార్జన కోసమే హిందూయేతర మత విశ్వాసాలను ఆచరిస్తూ, బయట ప్రపంచంలో హిందువుగా నటించడం ద్వారా వెంకన్న సంపదను దోచుకున్నాడని ఆరోపించారు.భూమన తితిదే చైర్మన్‌గా, సభ్యుడిగా ఉన్నప్పుడు కూడా సదరు విగ్రహం అక్కడే ఉన్నదని, ఆనాడు పట్టించుకోకుండా ఇప్పుడు రాద్ధాంతం చేయడం పైన కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ చైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తిరుపతి పార్లమెంటు నాయకులు సోంపల్లి మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ముఖ్యమంత్రి సహాయనిధి

విశాలాంధ్ర-తొట్టంబేడు: ముఖ్యమంత్రి సహాయనిధిని లబ్ధిదారుల ఇంటి వద్దకే తీసుకెళ్లి బొజ్జల బృందమ్మ బుధవారం పంపిణీ చేశారు. ఈ సహాయ నిధి పేదలకు వరమని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. తొట్టంబేడు మండలంలో పదిమంది బాధితులకు రూ. 13,65,289 విలువ గల చెక్కులు ఆమె అందించారు. ఇందులో చియ్యవరంకు చెందిన కె.సుబ్బయ్యకు రూ.40,786లు... వి.ఏకంబరం భార్యకు రూ.1,04,979 గొట్టిపూడికి చెందిన రాధికకు రూ. 1,72,105లు.. పెద్ద సింగమాలకు చెందిన వై. రవీంద్రరెడ్డికి రూ.1,29,231లు... పూడికి చెందిన రామా నాయుడుకు రూ.46,084లు... బోనుపల్లికి చెందిన బి.జనార్దన్‌కు రూ.81,739లు... కొత్తకండ్రిగకు చెందిన వెంకటసుబ్బమ్మకు రూ.40,041 వంతున చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రంగినేని చెంచయ్యనాయుడు, గాలి మురళినాయుడు, కన్నలి ప్రతాప్ రెడ్డి, కొన్నలి రమేష్, మల్లీశ్వరి, బాలాజీరెడ్డి పాల్గొన్నారు.

19న ఛలో మెడికల్ కాలేజీని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ఈనెల 19వ తేదీన మదనపల్లి లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీని సందర్శించి కూటమి ప్రభుత్వం చేస్తున్న మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేఖించడానికి చేపట్టిన ఛలో మెడికల్ కాలేజీని విజయవంతం చేయాలని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మల గుంటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం యువజన విభాగం, విద్యార్థి విభాగం నేతలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన మదనపల్లిలో ప్రయివేటు పరం చేయనున్న మెడికల్ కాలేజీని సందర్శించి నిరసన వ్యక్తం చేయనున్నట్టు తెలిపారు. నిరసనకు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు, యువజన విభాగం నాయకులు తరలి రావాలన్నారు. వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బి.ఓబుల్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శశిధర్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు చెంగల్ రెడ్డి, మండల అధ్యక్షులు గూడూరు రఫీ, వినోద్ కుమార్, నక్క హరినాథ్, శేష రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షులు ముని రెడ్డి, రామ్ తేజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్, వెంకటరమణ నాయక్, ప్రతీప్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

శుభ దిన్ తిథి భోజనం ఏర్పాటు గొప్ప ఆలోచన

విశాలాంధ్ర-కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో దాతల ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తో పాటు స్నాక్స్ లేదా మీల్స్ ఏర్పాటు చేయడం గొప్ప ఆలోచన అని డీ.ఎం.పురం హెచ్.ఎం నాదముని రెడ్డి తెలిపారు.పి.ఎం. పోషన్ అమలులో భాగంగా కేంద్రప్రభుత్వం యొక్క మంచి ఆలోచన శుభ్ దిన్ తిథి భోజనం అని డీ.ఎం.పురం పాఠశాల కమిటీ చైర్మన్ త్యాగరాజు అన్నారు. బుధవారం పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు సతీమణి స్వాతి పుట్టిన రోజు సందర్భంగా 125 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తో పాటు వడ, అరటి పండు,పాపడ్స్ అందించారని హెచ్.ఎం నాదముని రెడ్డి తెలిపారు. 3500 రూపాయల విలువ చేసే స్టేజ్ స్క్రీన్ను పాఠశాలకు వితరణగా అందించిన ధాతని అభినందించారు. ఉపాధ్యాయులు సరస్వతి,మాలతి, కళై వాణి, వ్యాయామ సంచాలకులు కిషోర్ కుమార్, బొజ్జా రాము, డిల్లీ బాబు, రాములు, కార్వరాయ, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన మహిళలే శక్తివంతమైన కుటుంబం

➡ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం తప్పక సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: ఆరోగ్యవంతులైన మహిళలతోనే బలమైన కుటుంబం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు పధిహేను రోజుల పాటు నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు. తిరుపతి అర్బన్ నరసింహ తీర్థం, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్(మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు) కార్యక్రమం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, టిటిడి బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి, శాప్ చైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పోరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ లతో కలిసి జిల్లా జాయింట్ శుభం బన్సల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.., ఈ రెండు వారాల కార్యక్రమంలో జిల్లాలో 536 క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గుండె జబ్బులు, మధుమేహం, నోటి కాన్సర్, గర్భాశయ కాన్సర్ వంటి వ్యాధులపై నిర్ధారణ, తగిన వైద్య చికిత్సలు, అవసరమైన రెఫరల్ సేవలు అందించడం జరిగేలా ముందుగా ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతోందని చెప్పారు. అంతేకాకుండా మహిళలు, కిషోర బాలికలలో రక్త హీనతను గుర్తించి చికిత్సలు అందించడం, గర్భిణీ స్త్రీలకు పోషకాహార అవసరాలను వివరించి కౌన్సిలింగ్ అందించడం, వ్యాధి నిరోధక టీకాలు వేయించడం, శుభ్రతపై అవగాహన కల్పించడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులు అందించడం జరుగుతుందని వివరించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.., ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజున ఈ అవగాహన కార్యక్రమాలు ప్రారంభించడం ఆనందంగా ఉందని, సమాజ అభివృద్ధికి మహిళల ఆరోగ్యం అనివార్యమైన అంశమని తెలిపారు. గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, టిటిడి బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.., దేశవ్యాప్తంగా ఆరోగ్యకరమైన, సమర్థ మహిళలను పెంపొందించడం ద్వారా సమష్టి అభివృద్ధిని బలోపేతం చేయాలని తెలిపారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ.., గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో సమగ్ర ఆరోగ్య ప్రచార సేవలు అందిస్తూ కార్యక్రమం విజయవంతంగా జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్, పిడి వసంతబాయి, బిజేపీ నాయకులు సుచరిత, అజయ్, కార్పొరేటర్లు సికే రేవతి, కల్పన యాదవ్ తదితరులు హాజరయ్యారు.

కుప్పాన్ని మోడల్ పారిశ్రామిక నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే సిఎం ధ్యేయం

విశాలాంధ్ర - కుప్పం : కుప్పం నియోజకవర్గాన్ని ఒక మోడల్ పారిశ్రామిక నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలో భాగంగా, ప్రభుత్వం పరిశ్రమల స్థాపన కోసం భూములను సేకరించే ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ క్రమంలో గుడిపల్లి మండలం పొగరు పల్లిలో పరిశ్రమల కోసం తమ భూములను ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించామని ఆర్‌డిఓ శ్రీనివాసులురాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 49 మంది రైతులకు మొత్తం రూ. 10,84,48,759 పరిహారం ప్రభుత్వం తరఫున అందజేయబడింది. భూములు ఇచ్చినందుకు రైతులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ పరిహారం వారి కుటుంబాల ఆర్థిక స్థిరత్వానికి ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎ పి ఎస్ ఆర్ టి సి ఉపాధ్యక్షులు పీఎస్ మునిరత్నం, ముఖ్యమంత్రి పారిశ్రామిక దృష్టిని విశదీకరిస్తూ మాట్లాడారు. కుప్పం నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన వల్ల స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని, వ్యాపారాల అభివృద్ధి జరిగి ప్రాంతం సుస్థిర ఆర్థిక ప్రగతి దిశగా పయనిస్తుందని పేర్కొన్నారు. అలాగే, ప్రభుత్వం పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, రాబోయే రోజుల్లో కుప్పం నియోజకవర్గం పరిశ్రమల కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ దిశలో రైతులు చూపిన సహకారం అభినందనీయమని ఆయన ప్రత్యేకంగా ప్రశంసిం చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బాబు నాయుడు , సుబ్బు, స్థానిక ప్రజాప్రతి నిధులు, రైతులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

చిత్తూరును అందంగా తీర్చిదిద్దుదాం

చిత్తూరులో ఘనంగా స్వచ్ఛతాహీ సేవ ర్యాలీ

విశాలాంధ్ర - చిత్తూరు : నగర ప్రజలు, యువత, నాయకులు అంతా కలిసి చిత్తూరును అందంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహీ సేవ -2025 కార్యక్రమాల్లో భాగంగా బుధవారం చిత్తూరులో స్వచ్ఛతోత్సవ్ ర్యాలీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, మేయర్ ఎస్.అముద తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా.. అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వ హించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, యువత భాగస్వాములై ఎక్కడా చెత్త లేకుండా చూడాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు స్వచ్ఛ గ్రామాలు, పట్టణాల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరు వారు ఉండే పరిసరా లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వార్డు స్థాయిలో నాయకులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు సమన్వ యంతో పనిచేసి స్వచ్ఛతా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాల న్నారు. అందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ చిత్తూరు సాధ్యమవుతుందన్నారు. చెత్త లేని నగరంగా చిత్తూరును తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు బాధ్యతతో పనిచేయాలన్నారు. కార్యక్ర మంలో కమిషనర్ పి నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, ఎంహెచ్వో డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు, కార్పొరేటర్లు ఇందు, శశి, భాజాపా నాయకులు అట్లూరి శ్రీనివా సులు, తెదేపా నాయకులు వెంకటేష్ యాదవ్, నరేష్ చౌదరి, పచ్చయప్ప, సబితా, రాణి, లీలావతి, రాజేశ్వరి ఇతర అధికారులు, నాయ కులు, నగరపాలక ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా విశ్వకర్మ జయంతి

● చిత్రపటానికి నివాళులర్పించిన డిఆర్ఓ

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : విశ్వకర్మను మొట్టమొదటి వాస్తు శిల్పగా భావిస్తారనీ డిఆర్ఓ నరసింహులు తెలిపారు. బుధవారం తిరుపతి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరము నందు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా బీసీ సంక్షే మ శాఖ అధికారి భరత్ కుమార్ రెడ్డితో కలిసి జిల్లా రెవిన్యూ అధికారి (డిఆర్ఓ) నరసింహులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన ంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడు తూ.. సృష్టికి ముందే విశ్వకర్మ జన్మించారని, సమాజానికి అవసరమైన వివిధ వృత్తులను సృష్టించారని, మొట్టమొదటి వాస్తు శిల్పగా వారిని భావిస్తారని తెలిపారు. మన రాష్ట్రం కంటే ఉత్తరాంధ్ర రాష్ట్రంలో విశ్వకర్మకు ప్రాము ఖ్యత కలిగి ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగ జరుపుకోవడం జరుగుతుం దని, కుమ్మరి, వడ్రంగి కంచు, శిల్పి, స్వర్ణకారుడు తదితర వృత్తులను సృష్టించి సమాజా నికి అవసరమైన వస్తువులను తయారు చేసుకునేలా ఎనలేని కృషి చేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరు విశ్వకర్మను ఆదర్శంగా తీసుకొనీ సన్మార్గంలో నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఓ,సిబ్బంది,బీసీసంక్షేమశాఖఅధికారులు పాల్గొన్నారు.

ఎంవోయు అమలు కోసం.. డిస్కం ఉద్యోగుల ఉద్యమం

➡ ఖాళీ పోస్టుల భర్తీకి డిస్కం జేఏసీ విజ్ఞప్తి

విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్: రాష్ట్ర విద్యుత్ జేఏసీ ఇచ్చిన దశల వారి ఆందోళన కార్యక్రమాల పిలుపుమేరకు, తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద 3వ రోజు భోజన విరామ సమయంలో ధర్నా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిస్కం జెఏసి నాయకులు 200 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిస్కం జేఏసీ చైర్మన్ వి.దేవేంద్ర రెడ్డి మాట్లాడుతూ.., మేనేజ్మెంట్ అవలంబిస్తున్న ఏకపక్ష ధోరణిని ఎండగట్టారు. మేనేజ్మెంట్ వారితో కుదుర్చుకున్న ఎంవోయూ ప్రకారం ఆర్డర్స్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నందుకు, అదేవిధంగా కాంట్రాక్టు కార్మికులకు రావాల్సిన పిఆర్సి అరియర్స్ను వెంటనే ఇవ్వాలని జేఎల్ఎం గ్రేడ్ 2 కార్మికులకు డిపార్ట్మెంట్ రెగ్యులర్ జేఎల్ఎమ్స్ లాగానే వర్కార్డర్స్ ఉండాలని, వారిని రెగ్యులర్ చేయాలని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు థర్డ్ పార్టీ లేకుండా డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలని తెలిపారు. 1999 నుండి 2004 వరకు రిక్రూట్ అయిన వారికి ఈపీఎఫ్ టు జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. రిటైర్ అయిన కార్మికులకు, రెగ్యులర్ కార్మికులకు అన్లిమిటెడ్ మెడికల్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. అదేవిధంగా 1993 బ్యాచ్ వారికి ఉన్న జీతభత్యాల వ్యత్యాస సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఓఅండ్ఎం నుండి జూనియర్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్ కన్వర్షన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి అని తెలిపారు. డిస్కౌంట్ చేసి కోచ్ చైర్మన్ నాగరాజు మాట్లాడుతూ.., కంపెనీలకు కార్మిక నాయకులకు మధ్య కుదిరిన ట్రై పార్టీ అగ్రిమెంట్ ప్రకారం మేనేజ్మెంట్ నడుచుకోవాలని మరి అదే విధంగా కార్మికులకు రావలసిన సాధారణమైన సమస్యలను పరిష్కరించాలని మాత్రమే కోరమేకాని తీర్చలేనివి మేము కోరడం లేదని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఉద్యోగులపైన పని భారాన్ని తగ్గించాలని తెలిపారు. డిస్కం కన్వీనర్ మురళీధర్ మాట్లాడుతూ.., మేనేజ్మెంట్ కు కార్మిక సంఘాలకు కుదిరిన ట్రైపార్టీ అగ్రిమెంట్ ప్రకారం, ఎంవోయుల ప్రకారం వెంటనే సమస్యల పైన పరిష్కారం చూపాలని లేకుంటే రాష్ట్ర జేఏసీ ఇచ్చిన దశల వారి ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిస్కం నాయకులు వైస్ చైర్మన్ ఐ.సుబ్రహ్మణ్యం, జయమణి, చలపతి, తిరుపతి జిల్లా జేఏసీ చైర్మన్ వెలకటూరి గోపి, అభినయ్ కార్తీక్, బాలకృష్ణ, వేణుగోపాల్, మహదేవరెడ్డి, శశిధర్ రెడ్డి, గుణశేఖర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.